08112024-MAI-04_Layout 1 11/8/2024 2:49 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కుంభకోణాల కుప్పలు

స్కాముల స్వాములు వచ్చారు ఇక వాముల కొద్దీ అవినీతి చూడక తప్పని రోజులు వచ్చాయి. స్వాతంత్ర్యం తర్వాత పాలనా పగ్గాలు కాంగ్రెస్ చేపట్టడంతో అధికారం, అవినీతి చెట్టపట్టాలేసుకొని సాగడం మొదలైంది. నెహ్రూ హయాంలో అంతంత మాత్రంగా ఉన్న అవినీతి ఇందిరా గాంధీ హయాంలో ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. ఒక రకంగా ఇందిరమ్మ రాజ్యం అవినీతికి పర్యాయపదంగా మారిపోయింది. ముడుపులు పుచ్చుకోవడమనేది విశ్వజనీన సంస్కృతి అని ఆమె అడ్డంగా సమర్థించుకున్నారు కూడా. రాజీవ్ గాంధీ హయాంలో ప్రభుత్వాన్ని ఓడించే ఆయుధంగా అవినీతి మారడం తెలిసిందే. సౌమ్యుడు, మచ్చలేని వాడు, అన్నిటికీ మించి నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందని వాడైన ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ పాలనలోనూ అవినీతి ఊడలు దిగడం మనం చూశాం. టూజీ, బొగ్గు స్కాంలతో స్కాంగ్రెస్ అనే మారు పేరును సార్థకం చేసుకున్నది అతివృద్ధ పార్టీ. ఈ సంస్కృతిని, వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేమేం తక్కువ తిన్నామా అంటూ పేరు నిలబెట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నట్టే కనిపిస్తున్నది. రోజురోజుకూ బయటపడుతున్న కుంభకోణాలే అందుకు నిదర్శనం. అవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్టు అన్ని స్థాయుల్లో అవినీతి అల్లుకుపోతున్నది.

పిల్లి నల్లదైతేనేం, తెల్లదైతేనేం ఎలుకల్ని పడితే చాలు కదా అన్నట్టుంది సీఎం రేవంత్ ధోరణి. తాను ఆంధ్రా కంపెనీ, అరాచక కంపెనీ అని తిట్టిపోసిన ఓ సంస్థకు ఇప్పుడు మనసు మార్చుకొని మూసీ ప్రాజెక్టు ఎందుకు కట్టబెట్టారో ఆయన చెప్పాల్సి ఉన్నది. 'నిన్నటి ఈస్టిండియా కంపెనీ నేటి బెస్టిండియా కంపెనీగా మారిందా?' అనేది ప్రశ్న. అటు బీజేపీ వాళ్లు నన్నాయి నొక్కులతో సరిపెడుతుండటం విడ్డూరం. ప్రాజెక్టుల వ్యయాలు పెంచేయడం అనుమానాలను మరింత బలపరుస్తున్నది. కాళేశ్వరం నీళ్లు మూసీకి గండిపేట ద్వారా మళ్లించే ప్రాజెక్టు వ్యయం తిప్పి తిప్పి కొడితే రూ.1100 కోట్లు కూడా కాదు. కానీ, సర్కార్ రూ.5,500 కోట్లుగా ఖరారు చేసింది. ఇక సుందరీకరణ కాదు, పునర్జీవీకరణ అంటూ తలపెట్టిన మూసీ ప్రాజెక్టుతైతే లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తారట. రూ.70-80 వేల కోట్లతో రాష్ట్రానికి జలకళ తెచ్చిన కాళేశ్వరంపై లక్ష కోట్ల అవినీతి అంటూ కండ్లల్ల నిప్పులు పోసుకున్న వారు ఇంత లేసి ఖర్చు చేసేది దేనికో ఇప్పటికీ స్పష్టత రాలేదు. కొత్తగా ఎక్కడన్నా తాగునీరో, సాగునీరో ఇస్తారా అంటే ఇదమిద్ధంగా ఏమీ చెప్పడం లేదు. కాంగ్రెస్ పాలకుల మూసీ అంకెల సంబురం చూస్తుంటే అప్పుడే అవినీతి మురికి కంపు కొడుతున్నది. టెండర్లు పిలవకుండానే ఒప్పందాలు జరిగిపోవడం ఆ సంగతినే పట్టిస్తున్నది. ఇక కొడంగల్ ఎత్తిపోతల్లో పేరున్న బయటి కంపెనీలను కాదని 'మన వాళ్లకు' ధార పోస్తుండటం గమనార్హం. మంత్రికి చెందిన కంపెనీకి ప్రాజెక్టులు అప్పగించడం అనైతికం ఎందుకు కాదో కాంగ్రెస్ సర్కార్ పెద్దలే చెప్పాలి.

అధికారానికి దూరమై అర్రులు చాస్తున్న కాంగ్రెస్‌కు ముందుగా కర్ణాటక, తర్వాత తెలంగాణ రాష్ట్రాలు చేజిక్కాయి. ఈ రెండు రాష్ట్రాలు ప్రస్తుతం ఆ పార్టీకి రూపాయలు పిండుకునే ఏటీఎంలుగా మారాయి. ఫలితంగా రెండు రాష్ట్రాలు కుంభకోణాల కుప్పలుగా మారాయి. గిరిజన కార్పొరేషన్ నిధులను కర్ణాటక సర్కారు గోల్‌మాల్ చేసి తన డీఎన్‌పను గొప్పగా చాటుకున్నది. కానీ, రాహుల్‌తో సహా కాంగ్రెస్ అధిష్ఠానం అలాంటివి చూసీచూడనట్టు పోతున్నది. ఢిల్లీలో అదానీపై రాహుల్ అంతెత్తు ఎగురుతున్నట్టు కనిపిస్తారు. కానీ, అదే అదానీకి ఇక్కడ రాచమర్యాదలు జరుగుతాయి. రామన్నపేట సిమెంట్ ఫ్యాక్టరీని పువ్వుల్లో పెట్టి అప్పగిస్తారు. మరోవైపు కేంద్ర బీజేపీ నాయకత్వాన్నీ, రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలు ప్రసన్నం చేసుకొని పనులు వెళ్లదీసుకుంటున్న సూచనలూ కనిపిస్తున్నాయి. ఈడీ దాడుల సమాచారం బయటకు రాకుండా చూసుకుంటున్నారంటే వారి ప్రతిభా సామర్థ్యాలకు జోహార్లు అర్పించాల్సిందే. ఇలా ఏక కాలంలో జోడు గుర్రాల స్వారీ చేయడం వారికే చెల్లింది. కానీ, ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఇవాళ రాష్ట్రంలో అన్ని రంగాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. రైతులు, విద్యార్థులు, చివరికి పోలీసులు కూడా రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. కానీ, కాంగ్రెస్ పెద్దలు కాసుల వేటలో, సూట్‌కేసుల మోతలో తలమునకలుగా ఉన్నారు. తెలంగాణలో దక్కించుకున్న ఒక్క అవకాశం కూడా దేశమంతటా జరిగినట్టుగానే చివరి అవకాశంగా మారుతుందనే మాట ప్రజల నుంచి బలంగానే వినిపిస్తున్నది. ఎందుకంటే తెలిసో తెలియకో అధికారాన్ని చేతుల్లో పెట్టింది వారేనని గుర్తుంచుకుంటే మంచిది.

ట్రంప్ గెలుపుతో ఒరిగేదేమిటి?

దేశ స్వాతంత్ర్య పోరాటం గురించి కన్యాశుల్కంలో గిరీశం జట్కా బండి నడిపే వ్యక్తికి సుదీర్ఘంగా వివరిస్తే... దేశానికి స్వాతంత్ర్యం వస్తే మా ఊరి హెడ్ కానిస్టేబుల్ బదిలీ అవుతాడా? అని అమాయకంగా అడుగుతాడు. ఎవరి సమస్య వాళ్లది. అమెరికా అంటే ప్రపంచానికి పెద్దన్న. అమెరికా తన ఒక్క దేశాన్నే కాదు, పరోక్షంగా మొత్తం ప్రపంచాన్ని పాలిస్తుంది. ఆ మాట నచ్చకపోతే ప్రపంచంపై ప్రభావం చూపుతుంది అనవచ్చు. అందుకే అమెరికా ఎన్నికలు అంటే ప్రపంచం ఆసక్తి చూపుతుంది. ఉత్కంఠకు తెర వేస్తూ రెండవసారి డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. ట్రంప్ విజయం సాధించడం ద్వారా అమెరికాలో ఒక చరిత్ర సృష్టించారు. వందేండ్ల కిందటి నాటి రికార్డ్‌ను బ్రేక్ చేశారు.

బుద్ధా మురళి

గ్రోవర్ క్లివ్‌లాండ్ 1885-1889 అమెరికా అధ్యక్షునిగా ఉండి, తరువాత ఎన్నికల్లో ఓడిపోయి 1892లో గెలిచారు. ఇప్పటి వరకు ఒక సారి ఓడిపోయి మళ్లీ గెలిచిన వారిలో ఇప్పటివరకు వీరిదే రికార్డ్. 132 ఏండ్ల ఈ రికార్డ్‌ను ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయిన తర్వాత అతని రాజకీయ జీవితం ముగిసిపోయింది అనిపించింది. ఎన్నో కేసులు, ఎన్నో ఆరోపణలు... అయినా వాటిని తట్టుకొని ఫీనిక్స్ పక్షిలా ట్రంప్ తిరిగి నిలదొక్కుకోవడమే కాకుండా ఘన విజయం సాధించారు. గత ఎన్నికల్లో ఏకంగా మన ప్రధాని మోదీ అమెరికా వెళ్లి ట్రంప్‌కు ఓటు వేయమని ఎన్నికల సభల్లో ప్రచారం చేశారు. ట్రంప్‌తో కలిసి మోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం విమర్శలకు దారితీసింది. ఆ ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయారు. ఈ సారి ట్రంప్ విజయం సాధించడం సహజంగా బీజేపీ శ్రేణులకు సంతోషం కలిగించింది.

జో బైడెన్ అమెరికా అధ్యక్షుడు అయినప్పుడు అమెరికా ప్రజలతో పాటు ప్రపంచదేశాలు కూడా ట్రంప్, బైడెన్‌ల మధ్య పోల్చి చూసుకున్నారు. అమెరికా ప్రజలైనా తెలంగాణ, ఆంధ్ర ప్రజలైనా తమ పాలకులను గత పాలకుల పని తీరుతో పోల్చి చూసుకోవడం సహజం. ట్రంప్, బైడెన్‌ల మధ్య పోటీ అనగానే ట్రంప్ గెలుపు నల్లేరు మీద నడక అనిపించింది. ఎప్పుడు కింద పడిపోతాడో, ఎప్పుడు ఎటు వెళ్తాడో తెలియని బైడెన్ కన్నా ట్రంప్ చాలా బెటర్ అని అనిపించడం సహజం. చివరి దశలో కమలా హారీస్‌ను రంగంలో దించడంతో ఆమె మంచి పోటీ ఇచ్చారు.

ట్రంప్ విజయం సాధించగానే హెచ్-1 బీ వీసాల మంజూరుపై ప్రభావం ఎలా ఉంటుందని ఓ మధ్య తరగతి తండ్రి ప్రశ్న, మన పిల్లల అమెరికా చదువులకు ట్రంప్ విజయం అనుకూలమా? వ్యతిరేకమా? అని సందేహం. అక్కడ చదువుకుంటే చదువు అయిపోగానే గ్రీన్ కార్డు ఇస్తామని ట్రంప్ గతంలో హామీ ఇచ్చాడు కదా? అమలు చేస్తాడా? అని ఓ తండ్రి డౌట్. ఎవరి కోణంలో వాళ్లు ట్రంప్ విజయంపై ఊహాగానాలు, వ్యాఖ్యానాలు సాగిస్తున్నారు. ఎవరి ఊహాగానాలు ఎలా ఉన్నా? ఎవరు తమకు అనుకూలం, తమకు వ్యతిరేకం అని అంచనాలు వేసినా ట్రంప్ ఎన్నిక అయింది అమెరికాకు అధ్యక్షునిగా అని మరువరాదు. ట్రంప్ అయినా, ఇంకొకరైనా అమెరికా అధ్యక్షునికి అమెరికా ప్రయోజనాలే ముఖ్యం తప్ప మరో దేశం కోసం త్యాగం చేసేవాళ్లు కాదు. మొత్తం ప్రపంచాన్ని అమెరికా తమ మార్కెట్‌గా చూస్తుంది. అమెరికా ప్రయోజనాలు ముఖ్యం తప్ప మన దేశమో, మరో దేశ ప్రయోజనాలో ముఖ్యం కాదు. ట్రంప్ అయినా, మరొకరైనా అమెరికా ప్రయోజనాలే ముఖ్యం.

> **ఎవరి కోణంలో వాళ్లు ట్రంప్ విజయంపై ఊహాగానాలు, వ్యాఖ్యానాలు సాగిస్తున్నారు. ఎవరి ఊహాగానాలు ఎలా ఉన్నా? ఎవరు తమకు అనుకూలం, తమకు వ్యతిరేకం అని అంచనాలు వేసినా ట్రంప్ ఎన్నిక అయింది అమెరికాకు అధ్యక్షునిగా అని మరువరాదు. ట్రంప్ అయినా, ఇంకొకరైనా అమెరికా అధ్యక్షునికి అమెరికా ప్రయోజనాలే ముఖ్యం తప్ప మరో దేశం కోసం త్యాగం చేసేవాళ్లు కాదు... ట్రంప్ అయినా, మరొకరైనా అమెరికా ప్రయోజనాలే ముఖ్యం.**

ఒకవైపు ఓట్ల లెక్కింపులో ట్రంప్ మెజారిటీ సాధించబోతున్నారని వార్తలు వస్తుండగా, ఓట్ల లెక్కింపు జరుగుతుండగానే భారత స్టాక్ మార్కెట్ ఇండెక్స్ దూసుకెళ్లింది. దాదాపు నెలరోజుల నుంచి ఎరుపెక్కిన మార్కెట్ అమెరికా ఎన్నికల ఫలితాలతో పచ్చగా కళకళలాడింది. రాజకీయపక్షాలు, మీడియా తమ తమ సిద్ధాంతాల ప్రకారం, రాజకీయ పాలసీల ప్రకారం ఫలితాలపై స్పందిస్తుంటాయి. ఒక్క స్టాక్ మార్కెట్ మాత్రం ఎలాంటి పక్షపాతం లేకుండా, రాజకీయ అనుకూలత, వ్యతిరేకతతో సంబంధం లేకుండా కేవలం లాభం/నష్టం అనే కోణంలోనే ముక్కుసూటిగా స్పందిస్తుంది. దేశాల మధ్య యుద్ధాలు, అమెరికా ఎన్నికలు, చైనా ఉద్దీపన పథకం వంటి అంశాలతో స్టాక్ మార్కెట్ నెలరోజుల నుంచి ఊగిసలాడుతున్నది. ఎరుపెక్కి ఆందోళన కలిగించింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) రూ.లక్ష కోట్లను స్టాక్ మార్కెట్ నుంచి తరలించుకు వెళ్లారు. మార్కెట్‌లో భారతీయ ఇన్వెస్టర్లు పెట్టిన పెట్టుబడులతో పోలిస్తే ఈ లక్ష కోట్లు ఒక శాతం కూడా కాదు. అయితే, దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. భారతీయ మార్కెట్ మీద విదేశీ ఇన్వెస్టర్లు నమ్మకం కోల్పోయారంటే ఆ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. చైనా మార్కెట్ వారికి ఆకర్షణీయంగా కనిపిస్తుండటంతో ఇక్కడి మార్కెట్ నుంచి నిధులు చైనాకు తరలిస్తున్నారనిపించింది. ట్రంప్ విజయంతో దీనికి బ్రేక్ పడింది. ఇండియా, అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్‌కు ఉమ్మడి శత్రువు చైనా. శత్రువు శత్రువు మిత్రుడు అన్నట్టుగా చైనాకు వ్యతిరేకంగా ట్రంప్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఇండియాకు ప్రయోజనం కలిగించే అవకాశం ఉన్నది. ఒక్క చైనా పైనే ఆధారపడటం ప్రమాదకరం అని చైనా ప్లస్ వన్ అనే నినాదంతో ఇండియా పట్ల సానుకూల ధోరణిని కరోనా కాలం నుంచి అమెరికాతో పాటు యూరప్ చూపుతున్నా యి. ట్రంప్ తాను అధికారంలోకి వస్తే చైనాపై ఆంక్ష లు విధిస్తానని ముందుగానే హెచ్చరించారు. దీనివల్ల ఇండియాకు ప్రయోజనం కలిగే అవకాశం ఉన్నది. ఫలితాలు వస్తుండగానే స్టాక్ మార్కెట్ నిఫ్టీ 270 పాయింట్స్ పెరిగింది. సెన్సెక్స్ 900 పాయింట్స్ పెరిగింది. మార్కెట్ మూడ్ నెల రోజుల నుంచి ఎరుపెక్కితే ఈ రోజు పచ్చదనంతో మూడ్ మారింది. ట్రంప్ అధికారంలోకి రావడంతో మన దేశంలో ఐటీ రంగానికి, బ్యాంకింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, డిఫెన్స్ రంగాలకు మేలు జరుగుతుందని మార్కెట్ అంచనా వేస్తున్నది. బుధవారం ఈ రంగాలకు చెందిన స్టాక్స్ మంచి లాభాలను అందించాయి. ట్రంప్ గెలవగానే అమెరికాలో ఇండియా గెలిచింది అన్నంతగా సంబురపడాల్సిన అవసరం లేదు. మేలుతో పాటు ఇబ్బందులు సైతం లేకపోలేదు. ఇండియా ఎక్కువగా ఎగుమతి సుంకాలు విధిస్తున్నదని ట్రంప్ గతంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికా ట్రేడ్ పాలసీల్లో ట్రంప్ మార్పులు తీసుకువచ్చే ప్రమాదం లేకపోలేదు. ఆ మార్పులు ఇండియాకు ఇబ్బంది కలిగించే అవకాశాలున్నాయి.

బ్రిటన్ ప్రధానిగా ఋషీ సునక్ ఎన్నిక కాగానే బ్రిటన్‌లో కన్నా మన దేశంలో హడావుడి ఎక్కువ కనిపించింది. నెమలి సింహాసనం సునక్ మనది మనకు ఇచ్చేస్తాడని, కోహినూర్ వజ్రాన్ని పువ్వుల్లో పెట్టిస్తాడని, టిప్పు సుల్తాన్ కత్తి పట్టుకొస్తాడని ఎవరి ఊహల మేరకు వాళ్లు వార్తలు వండివార్చారు. కమలా హ్యారిస్ భారతీయ మూలాలు, ట్రంప్ బృందంలో తెలుగింటి ఆడపడుచు గురించి వార్తలు వస్తున్నాయి. సునక్ అయినా, ట్రంప్ అయినా, కమలా హ్యారీస్ అయినా... ఇలా ఎవరైనా తమ దేశం కోసం పనిచేస్తారు. వాళ్ల దేశ ప్రయోజనాలు వారికి ముఖ్యం. ఈ ఊరికి ఆ ఊరు ఎంత దూరమో, ఆ ఊరికి ఈ ఊరు కూడా అంతే దూరం అన్నట్టు. అమెరికా, భారత్ స్నేహం పరస్పర ప్రయోజనాల కోసం సాగుతుంది కానీ, ఒకరి కోసం ఒకరు త్యాగాలు చేయరు. ట్రంప్ విజయం భారత్‌కు మేలు అని స్టాక్ మార్కెట్, వాణిజ్య వర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి. ట్రంప్ వల్ల ఇండియాకు, ఇండియా వల్ల అమెరికాకు ఎంత ప్రయోజనం అనేది కాలమే చెప్తుంది.

పుస్తకాల బండి ఆగిపోయింది

ప్రజల వద్దకు సాహిత్యాన్ని తీసుకెళ్లాలని పరితపించిన 'షేక్ సాధిక్ అలీ' పుస్తకాలను తోపుడు బండిపై కూడా అమ్మవచ్చునని నిరూపించారు. హైదరాబాద్ నుంచి వరంగల్ దాకా తోపుడు బండిపై పుస్తకాలమ్మిన సాధిక్ 2024, నవంబర్ 7 తెల్లవారుజామున గుండెపోటుతో చనిపోయారనే వార్త సాహితీవేత్తలను కలచివేసింది.

ఖమ్మంలోని శీలం సిద్ధారెడ్డి డిగ్రీ కాలేజీలో చదవటం వల్లనేమో సాధిక్ అలీ అభ్యుదయ భావాలకు దగ్గరయ్యారు. తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘంలో చురుకుగా పనిచేశారు. ఆ భావాలతోనే మతాంతర వివాహం చేసుకున్నారు. తర్వాత జర్నలిస్ట్‌గా జీవితాన్ని ప్రారంభించిన సాధిక్ ఉదయం పత్రికలో సుమారు ఎనిమిదేండ్ల పాటు జర్నలిస్ట్‌గా పనిచేశారు. అంతేకాదు, యూనియన్ కార్యకలపాలలో కూడా ఆయన చురుకుగా పాల్గొనేవారు. సీనియర్ జర్నలిస్ట్ ప్రసేన్ వంటి వాళ్లతో కలిసి సాధిక్ పాత్రికేయ వృత్తిలో రాణించారు. వృత్తిలో భాగంగా కవిత్వం, వ్యాసాలు, కథల వంటి అనేక సాహితీ ప్రక్రియలను చూశారు. అందుకేనేమో సాధిక్‌కు సాహిత్యం అంటే విపరీతమైన ప్రేమ.

తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత జరిగిన తొలి హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో సాధిక్ నాకు పరిచయమయ్యారు. ఆయన పుస్తక ప్రియులను, సాహితీ వేత్తలను అనేక మందిని ఏకంజేసే కేంద్ర బిందువుగా ఉండేవారు. రచయిత షాడో మధుబాబు లాంటివాళ్లను ఎంతోమంది రచయితలను సాధిక్ కొత్త తరాలకు పరిచయం చేశారు. యువత పుస్తకానికి పట్టంగట్టాలనే తలంపుతో 2016లో, హైదరాబాద్ నగరంలో కూరగాయలు అమ్మినట్టుగా తోపుడు బండిపై కవిత్వం, సాహిత్య పుస్తకాలను అమ్ముతూ ప్రచారం చేశారు. హైదరాబాద్ నుంచి భువనగిరి, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణాల మీదుగా తను ఒక్కడే తోపుడు బండిని తోసుకుంటూ పుస్తకాలను అమ్మేవారు. ఈ విధంగా పుస్తకాలను ప్రచారం చేస్తూనే, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించేవారు. విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని కలిగించేవారు. సాధిక్‌ను చూసి సాహిత్య ప్రియులే కాదు, సాహిత్యకారులు కూడా ఆశ్చర్యపోయే విధంగా కృషిచేశారు.



> **హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను ముమ్మరంగా గ్రామ గ్రామానికి తీసుకువెళ్లే కార్యక్రమాన్ని మేం చేపట్టాం. అందులో భాగంగానే మా పుస్తక ప్రదర్శనలకు తోడై, మాకంటే ఒకడుగు ముందుకేసి సాధిక్ తోపుడు బండిపై పుస్తకాలను తీసుకొచ్చేవారు. పుస్తక కార్యకర్తగా మారి పుస్తక పఠనాన్ని పెంచేందుకు ఊరూరా కలియదిరిగారు. జ్ఞానాన్ని తాళాలు వేసి బీరువాల్లో ఉంచకూడదని, మారుమూల పల్లెటూర్లకు తీసుకుపోయారు. సమాజం మొత్తాన్ని జ్ఞానవంతం చేయడమే అసలు జ్ఞానం అని పుస్తకాలు పట్టుకొని తిరిగిన సంచార జీవి సాధిక్. హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో కవులకు, రచయితలకు, తోపుడు బండి ఒక ప్రత్యేక ఆకర్షణీయ అడ్డాగా మారింది.**

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు జూలూరు గౌరీశంకర్ అధ్యక్షులుగా ఉన్న తొలినాళ్లలో జిల్లాలలో కూడా పుస్తక ప్రదర్శనలు నిర్వహించాలనే ఆలోచన వచ్చినప్పుడు మాకు మొదటగా గుర్తుకువచ్చింది షేక్ సాధిక్ అలీనే. అంతేకాదు, మేము వరంగల్‌లో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేసినప్పుడు అన్నీ తానై వ్యవహరించారు. ఖమ్మం పుస్తక ప్రదర్శనలో కూడా తోపుడు బండి స్టాల్ పెట్టి చదువరులను సాహిత్యం వైపు మళ్లించారు. తెలంగాణలో ఎక్కడ బుక్‌ఫెయిర్ నిర్వహించినా ఆ కార్యక్రమాన్ని సాధిక్ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసేవారు. కరోనా కాలంలో తన సొంత గ్రామమైన కల్లూరులో విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలు చేశారు. సాధిక్‌కు ఉన్న వ్యక్తిగత పరిచయాలను ఉపయోగించి ప్రభుత్వ పాఠశాలల్లోని పేద ప్రజల బిడ్డలకు, గిరిజన విద్యార్థులకు బట్టలు, పుస్తకాలు, బూట్లు వంటివి పంపిణీ చేస్తూ దాతృత్వాన్ని చూపేవారు. పిల్లల్లో పుస్తక పఠనం పెంపొందించేందుకు గాను ఉచితంగా పుస్తకాల పంపిణీ చేసేవారు.

తన జీవితంలో ఎత్తుపల్లాలను చవిచూసిన సాధిక్ కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఉత్సాహంతో మూడుసార్లు కాషాయ వస్త్రాలను ధరించి హిమాలయాలను సందర్శించారు. చిన్నా, పెద్ద తేడా లేదు, కులం, మతమనే తారతమ్యం లేకుండా అందరినీ దగ్గరికి తీసుకునేవారు. అందుకే సాధిక్ అలీ అంటే అందరికీ ఇష్టం. అయనను అమితంగా ప్రేమించే సాహితీవేత్తలు, సాహితీప్రియులు వందల మంది ఉన్నారు. తెలంగాణ నేలపైన తోపుడు బండి సాధిక్‌గా తనదైన ముద్రవేసి, అక్షరాలను ప్రేమించి, విద్యార్థులకు ప్రేమను పంచి మన నుంచి దూరంగా వెళ్లారు. సాధిక్ నీకు పుస్తకాలతో సెల్యూట్.

కోయ చంద్రమోహన్
86399 72160
(వ్యాసకర్త: పూర్వ కార్యదర్శి, హైదరాబాద్ బుక్ ఫెయిర్)

చెరిపేస్తే చెరిగిపోతాయా ఆనవాళ్లు..!

ఇనుగుర్తి సత్యనారాయణ
97046 17343

ప్రజలు కట్టబెట్టిన అధికారాన్ని పాలకులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల ఆస్తులకు ధర్మకర్తలుగా వ్యవహరిస్తూ భవిష్యత్ తరాల బాగుకోసం దార్శనికతతో ప్రణాళికలు రచించాలి. వాటిని అంకితభావంతో ఆచరణలో పెట్టాలి. సమాజం పట్ల సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలి. రాష్ట్ర భౌగోళిక, సామాజిక, ఆర్థిక స్థితిగతులు తెలిసి ఉండాలి. ప్రజలకు మంచి చేయాలనే తపనతో ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పాటుపడాలి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలి. కానీ, పాలన పట్ల తన ప్రాథమిక కర్తవ్యాన్ని మరిచి ప్రజల జీవితాలతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతున్నది. ఏమీ చేయకుండా.. ఏదో చేస్తున్నట్టు ప్రకటనలకే పరిమితమై కాలయాపన చేస్తున్నది.

అసలు కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో లేదు, పాలన ముందుకుసాగడం లేదు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రోజుకో బడాయి ప్రకటన చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ఇప్పటివరకు ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోలేదు. రైతు రుణమాఫీ తూతూమంత్రంగా మారిపోయింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జరిపిన సమావేశంలో కీలకమైన హామీ 'మహాలక్ష్మి' పథకంపై చర్చించినట్టు మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ పథకం అమలు సాధ్యం కాదని ఇరువురు చర్చించుకున్నట్టు ఆ కథనాలు ఉటంకించాయి. ప్రతీ మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని కాంగ్రెస్ చెప్పిన మాటలను నమ్మి ఆడపడుచులు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు. ఇప్పుడు సాధ్యం కాదని చేతులు దులుపుకొంటే సరిపోతుందా? తప్పుడు వాగ్దానం చేసినందుకు ప్రతి తెలంగాణ ఆడబిడ్డకు క్షమాపణలు చెప్పాలి. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేసినందుకు ముక్కు నేలకు రాయాలి.

ప్రస్తుత కాంగ్రెస్ పాలన.. ఉమ్మడి రాష్ట్రంలోని పదేండ్ల కాంగ్రెస్ పాలన కంటే భిన్నంగా నడుస్తున్నది. కనీసం ఇది కాంగ్రెస్ పాలనలా కూడా కనిపించడం లేదు. ప్రభుత్వ ఆర్భాటపు ప్రకటనలు, మీడియాను మేనేజ్ చేస్తూ 'ఆహా, ఓహో' అంటూ ఆకాశానికి ఎత్తించుకోవడం, ఓ వర్గం మీడియా అంతా అధికారం చుట్టూ ముసురుకోవడం స్పష్టంగా కనిపిస్తున్నది. తెరవెనుక శక్తుల కోసం కొందరు మీడియా అధినేతలు సీఎం రేవంత్‌రెడ్డికి తాము ఎంత చెప్తే అంత అన్నట్టుగా పతాక శీర్షికల్లో ఉచిత సలహాలు ఇవ్వడం గతంలో ఎక్కడో చూసినట్టు ఉంది కదా! అవును.. ఇది ముమ్మాటికీ నిరంకుశ చంద్రబాబు పాలనకు కాపీ- పేస్ట్‌లా కనిపిస్తున్నది. పాలన ముందుకు సాగకపోయినా మేనేజ్‌మెంట్ రాజకీయాలు చేయడంలో రేవంత్‌రెడ్డి.. తన 'సహచరుడు' చంద్రబాబును ఫాలో అవుతున్నారు. రాష్ట్రంలో బడిపిల్లల నుంచి వృద్ధుల దాకా రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారు. రైతుబంధు, రుణమాఫీ కోసం అన్నదాతలు, ఏక్ పోలీస్ నినాదంతో టీజీఎస్పీ బెటాలియన్ పోలీసులు ఆందోళన బాటపట్టారు. ఫించన్ రూ.4 వేలకు ఎప్పుడు పెంచుతారని వృద్ధులు ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగ భృతికి ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని యువతీయువకులు నిరీక్షిస్తున్నారు. ఈ హామీలన్నీ ఎప్పటికి సాధ్యమవుతాయో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్నది.

ప్రజాపాలన, ప్రజాస్వామిక పాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన కాంగ్రెస్ హుక్కుల కోసం గొంతెత్తేవారిని అణచివేయడానికి, ప్రశ్నించేవారిపై కుట్రపూరిత కేసులు పెట్టడానికి అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నది. 'ఎవరిని, ఎలా హ్యాండిల్ చేయాలో నాకు బాగా తెలుసు' అంటూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి చిట్‌చాట్‌లలో మాట్లాడుతున్నారు. హ్యాండిల్ చేయడం, మేనేజ్ చేయడంలు చంద్రబాబు దగ్గర నేర్చుకున్న విద్యలేమో మరి! చెప్పిన హామీలు ఆచరణలో పెడితే ఉద్యమాలను అణచివేయాల్సిన అవసరం, ఎవరినో మేనేజ్ చేయాల్సిన అనివార్యత, హ్యాండిల్ చేయాల్సిన అగత్యం ఎందుకు వస్తుంది? పాలకుల ప్రథమ కర్తవ్యం ప్రజలకు మంచి పాలన అందించడమేనని గుర్తిస్తే.. సొంత భావోద్వేగాలకు, రాగద్వేషాలకు తావుండదు. ఈ ప్రభుత్వం చెప్తున్నవి కాంగ్రెస్ మార్క్ నినాదాలు.. కానీ, పాలన మాత్రం ముమ్మాటికీ చంద్రబాబు తరహాలోనే నడుస్తున్నది.

పాలకుడికి విశాల దృక్పథం ఉండాలి. మంచిని మంచి అని, చెడును చెడు అని విమర్శించే దృక్పథం ఉండాలి. గత ప్రభుత్వాలు చేసిన మంచిని మెచ్చుకునే పెద్ద మనసు ఉండాలి. గతంలో ఆరోగ్యశ్రీ, 108 పథకాల ఘనత దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డిదేనని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా కొనియాడారు. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు, తెలంగాణ ఉద్యమ కోణంలో చూసినప్పుడ